సాక్షి
అనకాపల్లి





విద్యుత్ కాంతులతో యుద్ధ నౌకలు

ఆదివారం । 5 । జనవరి । 2025



కంటిన్యుటీ డ్రిల్

నేవీ షో.. అదిరింది


ముఖ్యమంత్రి చంద్రబాబుకు జ్ఞాపిక బహూకరిస్తున్న మెరైన్ కమాండో, చిత్రంలో ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్


లేజర్ షో




చేతక్ హెలికాప్టర్ల విన్యాసం


జయహో భారత్


విన్యాసాలు తిలకిస్తున్న నేవీ అధికారులు, వారి కుటుంబ సభ్యులు


బందీలను విడిపించేందుకు తీరానికి చేరుకున్న మార్కోస్



ఏయూక్యాంపస్: విశాఖ సాగర తీరంలో భారత నావికాదళం సమర శంఖం పూరించింది. దేశ రక్షణలో నావికా దళం చేస్తున్న కృషిని ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించింది. బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా శనివారం సాయంత్రం నిర్వహించిన ఆపరేషనల్ డెమో ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. సాయంత్రం 4.40 గంటలకు ప్రారంభమైన విన్యాసాలు సుమారు గంటన్నర పాటు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, తూర్పు నావికాదళ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మంత్రులు వంగలపూడి **అనిత, కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీలు గొల్ల బాబూరావు, సీఎం రమేష్, మేయర్ హరివెంకటకుమారి**, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, నేవీ సిబ్బంది విన్యాసాలను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మారిటైం గేట్ వేగా ఏపీ అభివృద్ధి చెందుతోందన్నారు.


బాణసంచా వెలుగులు

విన్యాసాలు సాగాయిలా..

- భారత నావికాదళం అద్భుతమైన విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ముందుగా జాతీయ, నావికాదళ పతాకాలను ఎగురవేశారు. నావికాదళ వాద్య బృందం శ్రావ్యమైన జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ఆరంభమైంది. అనంతరం చేతక్ హెలికాప్టర్లు త్రివర్ణ పతాకం, నావికాదళ పతాకాన్ని రెపరెపలాడిస్తూ ఆకాశంలో విహరించాయి.
- విపత్కర పరిస్థితుల్లో బందీలను విడిపించడానికి మెరుపుదాడి చేసే మెరైన్ కమాండోల(మార్కోస్) విన్యాసాలు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేశాయి. హెలికాప్టర్ నుంచి తాడు సహాయంతో సముద్రంలోకి దిగిన కమాండోలు, వెంటనే బోటులో తీరానికి చేరుకుని బందీలను విడిపించిన తీరు ఉత్కంఠభరితంగా సాగింది. వారి ధైర్యసాహసాలకు ప్రజలు సెల్యూట్ చేశారు. ఆయిల్ రిగ్ పేల్చివేత విన్యాసం ప్రేక్షకులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.
- ఆకాశం నుంచి నాలుగు పారాచూట్ల సాయంతో దిగిన మార్కోస్ బృందం ప్రత్యేక జ్ఞాపికను సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేసింది.
- ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఢిల్లీ యుద్ధ నౌకలపై హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు ల్యాండింగ్ అయిన విధానం విశేషంగా ఆకట్టుకుంది.
- తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ, శత్రువుల రాడార్లకు చిక్కకుండా సంచరించే హాక్ యుద్ధ విమానాల వ్యూహాత్మక విన్యాసాలు, నాలుగు చేతక్ హెలికాప్టర్ల విన్యాసాలు కనులపండువగా సాగాయి. అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల అన్వేషణ, రక్షించే విధానాల ప్రదర్శన ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది.
- నావికాదళ సిబ్బంది విధులు, వారి జీవనశైలిని వివరిస్తూ సీ క్యాడెట్ కార్ప్స్ విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శన లయబద్ధంగా సాగింది. యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ ఫైరింగ్, యుద్ధ నౌకల నుంచి చేసిన నమూనా కాల్పులు చూపరులను కట్టిపడేశాయి. చేతక్, సీ కింగ్ హెలికాప్టర్లు, డార్నియర్ హెలికాప్టర్, హాక్ జెట్ ఫైటర్ల విన్యాసాలు ఉత్సాహాన్ని నింపాయి.
- చివరగా నావికాదళ వాద్య బృందం ప్రత్యేకంగా అందించిన బీటింగ్ రిట్రీట్, తుపాకులతో అగ్నిని రగిలించే కంటిన్యుటీ డ్రిల్ కవాతు, నౌకలపై మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల అలంకరణలు, బాణసంచా ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఐఎన్ఎస్ సావిత్రి నుంచి నిర్వహించిన లేజర్ షో.. దేశభక్తి గీతాలకు అనుగుణంగా సాగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం అదరహో అనిపించింది. ప్రాచీన యుద్ధ కాలం నుంచి నేటి వరకు భారత రక్షణ వ్యవస్థ ప్రతిష్టను డ్రోన్ షో కళ్లకు కట్టినట్టు చూపించింది.
- నేవీ విన్యాసాల్లో ఎటువంటి అపశృతులు జరగకుండా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షించారు.


విన్యాసాలను తిలకిస్తున్న నగర ప్రజలు

న్యూస్‌రీల్

7న శిక్షణ, ఉద్యోగావకాశాల కల్పనకు ఇంటర్వ్యూలు

అనకాపల్లి: నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణతో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీఐపీఈటీ) డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. శేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.సీఐపీఈటీ, ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఎంపికైన 30 మంది యువకులకు విజయవాడలో ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో నెలకు రూ.3వేల చొప్పున గౌరవవేతనం అందజేయనున్నట్టు తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువకులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం విశాఖ, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, మైసూర్ తదితర ప్రాంతాల్లో ఉద్యోగావకాశాల కల్పించనున్నట్టు తెలిపారు.మరిన్ని వివరాలకు 9398535697 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వృత్తి కార్మికుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

మెప్మా పీడీ సరోజిని


మాట్లాడుతున్న మెప్మా పీడీ సరోజిని

యలమంచిలి రూరల్: పట్టణాల్లోని వృత్తి కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా వారిని గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) పీడీ ఎం.సరోజిని తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వివిధ వృత్తి కార్మికుల గుర్తింపు మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పనిచేస్తున్న ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ,టీవీ, గీజర్, రిఫ్రిజిరేటర్,వాషింగ్ మెషీన్ వంటి గృహోపకరణాలకు మరమ్మతులు చేసే వారిని గుర్తించి, మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. తొలి దశలో వివిధ వృత్తి కార్మికులను గుర్తించి వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ద్వారా తర్ఫీదునిచ్చి జీవనోపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. మేళాలో 206 మంది వృత్తి కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, మెప్మా సీఎంఎం పద్మావతి, డీఎంసీ వరలక్ష్మి,సీవోలు ఉమ,వెంకట రమణ, సత్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

వెలుగు చూడని నివేదిక..
అనుమానాలెన్నో..

- గతనెల 24న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో గర్భిణి మృతి
- వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ కిశోర్ నేతృత్వంలో విచారణ
- వారం రోజులైనా రిపోర్టు బయటపెట్టని వైద్యాధికారులు
- విచారణను నీరుగార్చేందుకే జాప్యమంటూ అనుమానాలు

సాక్షి, అనకాపల్లి: నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఓ గర్భిణి పురిటి నొప్పులతో మరణించిన వ్యవహారం నుంచి వైద్య సిబ్బందిని బయటపడేసేందుకు యత్నాలు జరుగుతున్నాయా ?.. ఈ వ్యవహారాన్ని నీరుగార్చేస్తున్నారా ?.. ఘటన జరిగి పది రోజులైనా.. విచారణ పూర్తి చేసి వారం రోజులు దాటినా.. నివేదికలో ఏముందన్న విషయం బయటకు వెల్లడించకపోవడంతో ఇవే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే గర్భిణి చనిపోయిందని ఆమె బంధువులు ఆరోపిస్తుండగా.. అధికారులు మాత్రం దురదృష్టకర సంఘటనగా పేర్కొంటూ విచారణను ముగించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఎస్.రాయవరం మండలం చినగమ్ములూరికి చెందిన సయ్యద్ మహాగున్నిషా అలియాస్ దేవి పురిటి నొప్పులతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో గత నెల 23న చేరింది. ఆ రోజు రాత్రి 8 గంటలకు డాక్టర్ పరీక్షించి వెళ్లారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో పురిటి నొప్పులు అధికంగా వచ్చాయి. దీంతో ఆమె భరించలేక ఆపరేషన్ చేయాలని వైద్య సిబ్బందిని ప్రాధేయపడింది. అయితే వారు వైద్యులకు ఈ సమాచారాన్ని అందించకుండా మాత్రలు ఇచ్చి, పరీక్షించి వెళ్లిపోయారు. ఆ నొప్పులతోనే ఆమె కన్నుమూసింది.

ముమ్మాటికీ వైద్యుల నిర్లక్ష్యం వల్లే..

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా దేవి మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విపరీతంగా నొప్పులు వస్తున్నాయని చెప్పినా ఆమెను ఐసీయూకి తీసుకెళ్లకుండా మాత్రలు ఇచ్చి వైద్య సిబ్బంది వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది చర్యలకు నిరసనగా కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్ నేతృత్వంలోని వైద్యాధికారులు గత నెల25న ఏరియాఆస్పత్రిలో విచారణనిర్వహించారు.

సెంటిమెంట్‌తో వచ్చి.. కన్నుమూసి..

దేవి మొదటి కాన్పు నర్సీపట్నం ఆస్పత్రిలో జరిగింది. తల్లీబిడ్డ క్షేమంగా ఇంటికి చేరుకున్నారు. దీంతో అదే సెంటిమెంట్‌తో మళ్లీ అక్కడికే వెళ్లింది. మొదటిసారి మంచి జరిగిందన్న నమ్మకంతో వచ్చిన ఆ గర్భిణి ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. ఆమె కడుపులో ఉన్న పసికందు బయటకు రాకుండానే తనువు చాలించింది. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. ఇదిలా ఉంటే గత ఆరునెలలుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ నివేదిక ప్రభుత్వానికి సమర్పించాం..



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో జరిగిన సంఘటనపై వైద్య సిబ్బందితో పాటు అక్కడ విధుల్లో ఉన్న వైద్యులను, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, బాధిత కుటుంబ సభ్యులను విచారించాం. వైద్యులు, వైద్య సిబ్బంది అందరూ డ్యూటీలోనే ఉన్నారు. ఉమ్మనీరు పోవడం, బీపీ తగ్గిపోవడం వంటి కారణాలతో 10 నిమిషాల వ్యవధిలోనే ప్రాణ నష్టం జరిగింది. విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాం. ప్రసవాల విషయంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రాష్ట్రంలోనే మంచి పేరు ఉంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగలేదు. రెండవ కాన్పు సమయంలో గర్భిణి, ఆమె కడుపులో ఉన్న బిడ్డ ఇద్దరూ మరణించడం బాధాకరం.

– డాక్టర్ రమేష్ కిశోర్,
వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్

బల్క్ డ్రగ్‌పార్క్ ఏర్పాటు విరమించుకోవాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో బల్క్ డ్రగ్‌పార్క్ ఏర్పాటును విరమించుకోవాలని సీపీఎం నాయకులు,పలువురు రైతులు డిమాండ్ చేశారు. రాజయ్యపేటలో పార్క్ ఏర్పాటును నిరసిస్తూ శనివారం ఆందోళన నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం,జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజుమాట్లాడుతూ మత్స్యకారులు, వ్యవసాయ కూలీలు, రైతులు, చేతివృత్తుల వారి ఉపాధిని దెబ్బతీసే బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ఏకపక్షంగా నిర్వహిస్తోందన్నారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం,ప్యాకేజీ చెల్లించకుండా కొబ్బరి,జీడితోటలు తొలగించడం అన్యాయమని తెలిపారు.నిర్వాసితుల కుటుంబాల్లో మేజర్లకు రూ.25లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఆర్.కార్డులు ఇవ్వాలని,ఉద్యోగాలు కల్పించాలన్నారు. రైతుల సమస్యలపై పోరాటాలకు అన్ని పార్టీలు కలసి రావాలని కోరారు.

ప్రధాని వర్చువల్ శంకుస్థాపన కోసం బహిరంగ సభ

రాజయ్యపేట వద్ద చురుగ్గా ఏర్పాట్లు


సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నక్కపల్లి : ఈనెల 8వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్‌పార్క్‌కు శంకుస్థాపన చేయనున్నారు. విశాఖ పట్నంలోని ఏయు గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో తిలకించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. రాజయ్యపేట సమీపంలో సుమారు 2 వేలమందితో ఈ బహిరంగ సభ నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని మోదీ శంకుస్థాపన కార్యక్రమాన్ని పెద్ద టీవీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి మండల ప్రజలకు చూపించనున్నారు. రాజయ్యపేటలో జరిగే ఈ సభకు నాలుగు మండలాల నుంచి సుమారు 2 వేల మందిని తరలించనున్నారు. ఈ బహిరంగ సభకు హాజరైన వారిలో కొంతమందితో ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడనున్నట్టు అధికారులు చెబుతున్నారు. సభ ఏర్పాట్ల బాధ్యతలను నర్సీపట్నం ఆర్‌డీవోకు అప్పగించారు. ఈ బహిరంగ సభలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఏపీఐఐసీ అధికారులు పాల్గొననున్నారు. ఏర్పాట్లను శనివారం మండల ప్రత్యేకాధికారి ప్రసాద్, ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు.

100 కేజీల గంజాయితో ఏడుగురి అరెస్టు


పోలీసులకు గంజాయితో పట్టుబడిన నిందితులు

చోడవరం : అక్రమంగా రవాణా చేస్తున్న 100 కేజీల గంజాయిని కొత్తకోట పోలీసులు పట్టుకున్నారు. ఈ గంజాయి తరలిస్తున్న ఆటోతోపాటు ఏడుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే...రావికమతం మండలం ఏజెన్సీ గ్రామమైన చీమలపాడు నుంచి 100 కేజీల గంజాయిని ఆటోలో వేసుకొని అక్రమ రవాణా చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో తనిఖీ చేయగా ఈ గంజాయి పట్టుబడింది. చీమలపాడు పంచాయతీ రుచిపనుగుల ఏజెన్సీ గ్రామం నుంచి గంజాయి రవాణా అవుతున్నట్టు సమాచారం రావడంతో దాడిచేసి పట్టుకున్నామని సీఐ తెలిపారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.5 లక్షలు విలువ చేసే గంజాయితోపాటు ఆటోను, కొంత నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు. రావికమతం మండలం దొండపూడికి చెందిన చందక సన్యాసిరావు, కిత్తంపేటకు చెందిన మారాజు రామారావు, జెడ్ గన్నవరంకు చెందిన గెమ్మిలి పోతురాజు, ఈశ్వరరావు, చింతపల్లి మండలానికి చెందిన ముప్వల రాజారావు, తమిళనాడుకు చెందిన మహ్మద్ కాలిత్, వనరాజ్ అయ్యర్‌ను పట్టుకున్నామని సీఐ తెలిపారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ. 2వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

గౌరీపట్నం వద్ద..

చోడవరం : పోలీసుల వాహనాల తనిఖీల్లో అక్రమంగా కారులో రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడింది. కారును స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. గౌరీపట్నం జంక్షన్‌వద్ద బీఎన్ రోడ్డుపై చోడవరం పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో 6కిలోల గంజాయిని గుర్తించారు. ఈ కారులో ప్రయాణిస్తున్న చింతపూడి వెంకట సత్యకుమార్, చొప్పాది లీప్‌లను అరెస్టు చేసి, గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నాగకార్తీక్ చెప్పారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్టు: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడ్ని చోడవరం పోలీసులు శనివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ నాగ కార్తీక్ చెప్పారు. డిసెంబరు 18వ తేదీన చోడవరంలో పట్టుబడిన గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు ఒకరు అదేరోజు పట్టుబడగా మరో వ్యక్తి పరారయ్యాడు. పరారైన నిందితుడు జోలాపుట్ మండలం పోలిపుట్టు గ్రామానికి చెందిన బడ్ నాయక్ ఎలియాస్ కేశవను చోడవరంలో అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

ఆక్రమణదారుల నుంచి కాపాడండి


తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్న ఈశ్వరమ్మ

మునగపాక : నెలల తరబడి తనకు న్యాయం చేయాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా, తన భూమిని కొంతమంది ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలుమార్లు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదని శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఓ మహిళ కన్నీటిపర్యంతమైంది. బాధిత మహిళ ఈశ్వరమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగులాపల్లికి చెందిన మళ్ల వెంకట శివ సత్యనారాయణ–ఈశ్వరమ్మ దంపతులకు 1.30 ఎకరాల మేర భూమి ఉంది. తాతల కాలం నాటి నుంచి భూమిలో ఉంటున్నారు. కొంతమంది తన భూమిలోకి ప్రవేశించి హెచ్చరిక బోర్డులను ధ్వంసం చేసి ఆక్రమించుకుంటున్నారని ఈ విషయమై న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారుల వద్ద మొరపెట్టుకున్నా న్యాయం జరగడం లేదని ఆమె వాపోయారు. ఈ మేరకు శనివారం తనకు న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయం వద్ద తాను చేసిన అర్జీలకు సంబంధించిన రశీదులను చూపారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కూడా ఫిర్యాదు అందించానని తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాలల శాస్త్రీయ ఆలోచనలకు దర్పణం

జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల్లో కొంగొత్త ఆలోచనలు రేకెత్తించింది. వినూత్నంగా తయారు చేసిన నమూనాలు ఆహూతులను అబ్బురపరిచాయి. బాల శాస్త్రవేత్తల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీశాయి. ఇందుకు కశింకోటలోని బాలికల హైస్కూలు వేదికైంది. ఇక్కడ శనివారం విద్యా శాఖ నిర్వహించిన జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో 72 నమూనాలు ప్రదర్శించారు.

- సృజనాత్మకతకు అద్దం పట్టిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన
- అభినందించిన కలెక్టర్ విజయకృష్ణన్
- అబ్బురపరిచిన నమూనాలు


ప్రదర్శనలో నమూనాలు పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్


రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో అప్పారావునాయుడు

కశింకోట : ఇక్కడ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రారంభించారు. నమూనాలను ఆసక్తిగా ఆద్యంతం పరిశీలించారు. అంతకుముందు జరిగిన సభలో మాట్లాడుతూ చదువే అన్నింటికి మూలమని, బాల్యంలోనే కష్టపడాలని, ఉత్తమ కేరీర్‌ను నిర్ణయించుకొని ముందుకు సాగాలన్నారు. సైన్స్‌లో కాన్సెప్ట్ అర్థం అయితేనే పరీక్షలు రాయగలుగుతారని, ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి జి.అప్పారావునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు అద్భుత ప్రయోగాలు చేసి నమూనాలు ప్రదర్శించారని, తమ సృజనాత్మకతను చాటి చెప్పారని అభినందించారు. ఉప విద్యా శాఖ అధికారి పి.అప్పారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తలచుకుంటే విద్యార్థులను ఏ స్థాయికైనా తీసుకెళ్లగలరన్నారు. ఈ సందర్భంగా బాలికల హైస్కూలు విద్యార్థుల కోలాటాలు, థింసా నృత్యం, వివిధ విన్యాసాలు ప్రదర్శించి ఆహూతులను అలరించారు. హెచ్ఎం స్వర్ణలత, ఎంఈవోలు పి.వి. సురేష్, కె.ఎస్.వి మూర్తి, ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ జయరజని, విద్యా నిర్వహణ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యురాలు కల్యాణి పాల్గొన్నారు.

విజ్ఞానదాయంగా నమూనాలు

ఉరిపోసుకొని ఆత్మహత్యలు చేసుకునే బాలికల మరణాల నివారణకు చోడవరం మండలం లక్ష్మీపురం హైస్కూలుకి చెందిన ఎం. రమేష్ 'యాంటీ సూసైడ్ ఫ్యాన్' పేరిట నమూనా తయారు చేశారు. సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి పోసుకొని ఎక్కువ మంది బాలికలు మరణిస్తున్నారని, వీటిని నివారించాలని భావించాడు. ఇందుకు వేలాడే ఫ్యాన్ తిరిగే రెక్కల పై భాగంలో బలమైన స్ప్రింగ్ అమర్చాలి. ఈ నేపథ్యంలో ఫ్యాన్‌కు ఉరి పోసుకోవడానికి ప్రయత్నిస్తే బరువుకు స్ప్రింగ్ సాగడంతో మనిషి వేలాడే అవకాశం లేకుండా నేలకు ఆనుకుంటాడు. దీనివల్ల ఉరికి అవకాశం లేకుండా నివారించవచ్చునని దీన్ని రూపొందించినట్లు రమేష్ తెలిపారు. దీన్ని అభినందిస్తూ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

బ్లైండ్ స్టిక్

అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన కె. నందకిషోర్ 'బ్లైండ్ స్టిక్'ను కంటి చూపు కానరాని దివ్యాంగులకు రోడ్డుపై రాళ్లను గుర్తించడానికి ఉపయోగపడే విధంగా రూపొందించాడు. దీన్ని పట్టుకొని రోడ్డుపై వెళ్లేటప్పుడు రాళ్లు ఉంటే బీప్ శబ్దం వస్తుంది. దీంతో దివ్యాంగుడు రాళ్లను గుర్తించడానికి అవకాశం కలుగుతుంది.

ఉమెన్ సేఫ్టీ బేంగిల్

మహిళ స్వీయ రక్షణకు ఉపయోగపడే విధంగా పరవాడ మండలం ధర్మారాయుడుపేట హైస్కూలుకి చెందిన విద్యార్థి సుహానా బేగం వుమెన్ సేఫ్టీ బేంగిల్ నమూనాను తయారు చేశారు. చేతికి వేసుకునే ఫ్యాషన్ గాజుల్లో ఒక దానిలో మిర్యాల పొడి, మరో దానికి జిఆర్‌పీ ట్రాకర్ పరికరాన్ని బయటకు కనబడకుండా అమర్చి వాటిని ధరించుకునేలా రూపొందించారు. ఎవరైనా దాడి చేస్తే ముందు మిర్యాల పొడి ప్రయోగం, తర్వాత నెట్‌తో పని లేకుండా సిమ్ సహాయంతో బ్యాటరీతో పనిచేసే జీపీఎస్ ట్రాకర్ పరికరం సహాయంతో తన సమాచారాన్ని ముందుగా ఫీడ్ చేసుకున్న ఫోన్ నెంబర్‌కు చేరవేడం దీని ప్రత్యేకత. దీంతో మహిళలకు రక్షణ లభించగలదని ఆశించి రూపొందించినట్టు సుహానా బేగం తెలిపారు.


ఆకట్టుకున్న విన్యాసాలు

స్మార్ట్ హోం...లైట్స్ ఆఫ్

చీడికాడ మండలం కోనాం హైస్కూలుకు చెందిన తనూశ్రీ, అనూషా కలిసి 'స్మార్ట్ హోం లైట్స్ ఆఫ్' నమూనా తయారు చేశారు. దీని ద్వారా ఎక్కడి నుంచైనా ఇంట్లో లైట్లను ఆన్, ఆఫ్ చేసుకోవచ్చు. దీనికి అమర్చిన కంట్రోలర్‌కు సెల్‌ఫోన్ హాట్ స్పాట్ సహాయంతో అనుసంధానించడం ద్వారా ఇది పని చేస్తుంది. దీనిద్వారా సెల్‌ఫోన్‌లో సెట్ చేసుకున్న ఇంటి గదుల్లోని లైట్లను ఆపుకోవచ్చునని, దీని ద్వారా విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని విద్యార్థులు తెలిపారు.

విజేతలకు బహుమతులు

జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ఆరు నమూనాలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. స్థానిక బాలికల హైస్కూల్లో జరిగిన ప్రదర్శనలో 24 మండలాల నుంచి వ్యక్తిగత, సమూహ, ఉపాధ్యాయ విభాగాల్లో 72 నమూనాలు ప్రదర్శనకు వచ్చాయి. వీటిలో వ్యక్తిగత విభాగంలో చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన ఎం. రమేష్ రూపొందించిన 'యాంటీ సూసైడ్ ఫ్యాన్' నమూనా ప్రథమ స్థానంలో నిలవగా, ఎస్.రాయవరం మండలం డీహెచ్ అగ్రహారానికి చెందిన సిహెచ్. మణికంఠ రూపొందించిన 'సొల్యూషన్ ఫర్ పొల్యూషన్' నమూనాకు ద్వితీయ స్థానం లభించింది. సమూహ విభాగంలో రాంబిల్లి మండలం డీహెచ్ అగ్రహారం హైస్కూలుకు చెందిన డి.స్నేహాంజలి, డి. త్రివేణి తయారు చేసిన నమూనాకు ప్రథమం, రోలుగుంట మండలం కుసర్లపూడికి చెందిన ఆర్.అన్వేష, భార్గవి రూపొందించిన నమూనాకు ద్వితీయ స్థానం లభించాయి. ఉపాధ్యాయ వ్యక్తిగత విభాగంలో అచ్యుతాపురం మండలం కాజీపాలేనికి చెందిన ఎస్.లక్ష్మి రూపొందించిన నమూనాకు ప్రథమం, వి.మాడుగుల మండలం గాదిరాయి స్కూలుకు చెందిన యు.ఎస్.ఎస్ యజ్ఞవల్కర్ నమూనాకు ద్వితీయ స్థానం లభించాయి. విజేతలకు బహుమతులను డీఈవో జి.అప్పారావు నాయుడు అందజేశారు.



ఎం.రమేష్ రూపొందించిన ప్రథమ స్థానంలో నిలిచిన 'యాంటీ సూసైడ్ ఫ్యాన్' నమూనా


ఆకట్టుకున్న నమూనా ప్రదర్శన



ఉమెన్ సేఫ్టీ బ్యాంగిల్ ధరించి చూపుతున్న బాలిక సుహానా బేగం


బ్లైండ్ స్టిక్ నమూనా

బావిలోపడి వృద్ధురాలి ఆత్మహత్య

అనకాపల్లి : వృద్ధురాలు బావిలోపడి మృతిచెందినట్టు పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. సీఐ విజయకుమార్ తెలిపిన వివరాలివి. గవరపాలెం రాజ్‌నగర్‌కు చెందిన జి.సత్యవతి(63) అనారోగ్య సమస్యతో శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. శనివారం ఇంటికి సమీపంలో ఉన్న బావిలో శవమై తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రెండు గ్రామాల్లో ఏకగ్రీవంగా పీసా కమిటీ ఎన్నికలు


పీసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి ప్రేమ్‌కుమార్

నాతవరం : రెండో రోజు రెండు గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగ శిరీష అన్నారు. మండలంలో శనివారం ధర్మవరపు అగ్రహారం, కృష్ణాపురం అగ్రహారం గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు జరిగాయన్నారు. ధర్మవరపు అగ్రహారం గ్రామంలో కమిటీ ఉపాధ్యక్షుడిగా బండి సత్యనారాయణ, కార్యదర్శిగా ఇరటా మహలక్ష్మిని ఎన్నుకున్నారన్నారు. కృష్ణాపురం అగ్రహారం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల్లో కమిటీ ఉపాధ్యక్షుడిగా నొక్కు శ్రీనివాస్, కార్యదర్శిగా ఇరటా అప్పలస్వామిని ఎన్నుకున్నారన్నారు. ఈ రెండు గ్రామాల్లో పీసా కమిటీలకు అధ్యక్షులుగా సర్పంచ్ వాకపల్లి చింతల్లి ఉంటారన్నారు. పీసా కమిటీ ఎన్నికలు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో జరిగాయన్నారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పదవులు ఐదేళ్ల పాటు ఉంటాయని తెలిపారు. ఈ రెండు ఎన్నికల అధికారులుగా జె.ప్రేమ్‌కుమార్ ఈ. దేవదత్తు వ్యవహరించారన్నారు. ఎన్నికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లాలోనే నాతవరం మండలంలో1/70 యాక్టు పరిధి గ్రామాలు ఉండడంతో పది గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు జరిగాయని గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీష అన్నారు. పీసా కమిటీ ఎన్నికలు సజావుగా జరిపించేందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, గిరిజన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికైన వారిని ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


కోటేశ్వరరావు

కె.కోటపాడు : మేడిచర్ల గ్రామానికి చెందిన రొంగలి కోటేశ్వరరావు (44) పురుగు మందు తాగి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. భర్త మృతిపై భార్య దేవి ఎ.కోడూరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 28న కోటేశ్వరరావు అప్పుల బాధతో పాటు అనారోగ్య సమస్యల కారణంగా పురుగు మందును సేవించాడు. కుమారుడు కిషోర్ గుర్తించి వెంటనే కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకెళ్లాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు.

ఎ.భీమవరంలో ధాన్యం కుప్ప దగ్ధం

కె.కోటపాడు : ఎ.భీమవరం గ్రామానికి చెందిన తాడి శ్రీనుకు చెందిన వరిపంట ఇటీవలే కుప్పగా ఏర్పాటు చేసారు. శనివారం ధాన్యం కుప్ప నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. టన్నున్నర ధాన్యంతో పాటు గడ్డిని కాలిపోవడం వల్ల రూ.50వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తాడి శ్రీను తెలిపారు.

వర్షాలతో అపరాల పంటలకు మేలు



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి : రబీ సీజన్‌లో రైతులు అపరాలు, నువ్వులు స్వల్పకాలిక పంటల సాగుద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శనివారం టీ అండ్ వి సమావేశం జరిగింది. ఈ సందర్భంగ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో కురిసిన అధిక వర్షాలు గత ఏడాది డిసెంబర్ నెలలో కురిసిన వర్షం వల్ల భూమిలో అధిక తేమ కలిగి ఉందని, దీని వల్ల రబీలో ఆరుతడి పంటలైన అపరాలు, నువ్వులు, ఇతర పంటలు వేసుకునేందుకు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ ప్రతినిధి సీహెచ్.సుబ్రమణ్యం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు ఆశాజనకంగా ఉందన్నారు.

బీచ్ హ్యాండ్ బాల్ పోటీల ప్రారంభం


బీచ్ హ్యాండ్ బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

అచ్యుతాపురం: పూడిమడకలో శనివారం బీచ్ హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు. ఈ జట్టు ఉత్తరాఖండ్‌లో జరగనున్న 38వ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సతీష్ పోటీలు ప్రారంభించారు.

క్లుప్తంగా

ఎన్‌సీసీ శిక్షణకు గవరపాలెం విద్యార్థులు



ఎన్‌సీసీ విద్యార్థులతో హెచ్‌ఎం సూర్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి జనార్దనరావు

అనకాపల్లి: అచ్యుతాపురంలోని ప్రశాంతి జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ(ఏటీసీ–2) శిక్షణకు తమ విద్యార్థులు 50 మంది హాజరైనట్లు స్థానిక జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి కాంద్రేగుల జనార్దనరావు, హెచ్‌ఎం ఎ.సూర్యనారాయణ శనివారం తెలిపారు. అచ్యుతాపురంలో ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు శిక్షణ ఇస్తారన్నారు. ఎన్‌సీసీ రెండేళ్లు పూర్తయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, పరీక్షలో ఉత్తీర్ణత సాధించాక 'ఎ'సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. 'ఏ' సర్టిఫికెట్ ద్వారా ఉన్నత విద్యతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు



స్కూలు వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు 20వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటికలు, పాటలతో ఆహూతులను అలరించారు. తల్లిదండ్రుల గొప్పతనం, స్నేహం గురించి పాడిన పాటలు, నృత్యాలు అలరించాయి. డీఈవో జి. అప్పారావునాయుడు, స్కూల్ పేటరన్ రెవ కెనాన్ జాన్ యతిరాజు, స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, చైర్‌పర్సన్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాల్ రూపనంది, ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

అనకాపల్లి: స్థానిక బాలాజీరావుపేటకు చెందిన బి.అప్పారావు పది మద్యం క్వాటర్ బాటిళ్లు తరలిస్తూ పట్టణంలో గాంధీనగరంలో పట్టుబడినట్లు సీఐ టి.వి.విజయకుమార్ శనివారం చెప్పారు. నిందితుడు మద్యం క్వాటర్ బాటిళ్లు బ్యాగ్‌లో పెట్టుకుని విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 5,073 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,200	5,320
మొదటి రకం	4,000	5,340
రెండో రకం	3,350	4,470
మూడోరకం	3,000	3,290

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	:	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	:	పర్తిసాయి
మ్యాక్స్	:	షిర్డీసాయి
క్రేవిన్ ది హంటర్	:	వెంకటేశ్వర
సై	:	శ్రీసత్య
మార్కో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–2 యూనిట్లు, బీ పాజిటివ్–7 యూనిట్లు, ఓ పాజిటివ్–9 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 348 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

వలంటీర్ విలవిల



ఆర్డీవో షేక్ అయిషాకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

- విధుల్లోకి తీసుకోని కూటమి ప్రభుత్వం
- గౌరవ వేతనం రూ.10 వేల పెంపు లేనట్టేనా?
- 6 నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు

అనకాపల్లి: టీడీపీ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైంది. వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నియమించిన వలంటీర్లను రోడ్డున పడేసింది. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్న వారిని విధులకు దూరం చేసింది. పైగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతతం రూ.5 వేలు ప్రస్తుత రోజుల్లో ఏమి సరిపోతాయని, కూటమి అధికారంలోకి వచ్చినట్లయితే నెలకు రూ.10వేలు గౌరవవేతనం అందజేస్తామని చంద్రబాబు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చి ఆరుమాసాలు అవుతున్నా వాటి ఊసే ఎత్తులేదు.

వలంటీర్ల నోట్లో మట్టి...

రెక్కాడితేగాని డొక్కాడని వలంటీర్ కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఆదుకుంటుందో అర్థం కావడంలేదు. అధికారం చేపట్టి ఆరు మాసాలు పూర్తవుతున్న వలంటీర్ గురించి పట్టించుకోకపోవడం అన్యాయమని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు లేకపోవడంతో వలంటీర్‌గా పనిచేస్తున్న నెలకు వచ్చిన గౌరవ వేతనంలో కుటుంబాన్ని పోషించుకునే సమయంలో చంద్రబాబు వలంటీర్ నోటిలో మట్టికొట్టారని వాపోతున్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన వలంటీర్లు

హామీని తక్షణమే అమలు చేయాలి..

కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో షేక్ అయిషాకు శనివారం వినతిపత్రం అందజేశారు. బకాయిపడ్డ ఆరు మాసాల జీతాలు తక్షణమే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, జాబ్‌కార్డు ప్రకటించాలని, బలవంతంగా రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ ఆరు మాసాలుగా వలంటీర్లు నిరుద్యోగ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలు వలంటీర్ ఉద్యోగంతో జీవనం సాగిస్తున్నాయని, ఎన్నికల హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



సార్వత్రిక ఎన్నికల సమయంలో రాజీనామాలు చేయాలని ఎంతమంది చెప్పినప్పటికీ ఉద్యోగ భద్రత కోసం చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేలు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలి. చాలామంది నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం.

– శీరంశెట్టి జ్యోతి, అక్కిరెడ్డిపాలెం గ్రామం, అనకాపల్లి మండలం

వలంటీర్ల ఆశలపై నీళ్లు



వలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఆశ చూపించి నిరాశ కలిగించింది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇంటింటికి వచ్చి చంద్రబాబునాయుడును గెలిపించినట్లయితే ఒక్కొక్క వలంటీర్‌కు గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారు వలంటీర్ ఇబ్బందులు గురించి మాట్లాడకపోవడం అన్యాయం.

– ఎస్.రత్నకుమారి, అనకాపల్లి

రేపు తుమ్మపాల గ్రామ సభ

అనకాపల్లి: తుమ్మపాల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈ నెల 6వ తేదీన గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ ప్రజల సమస్యలు పరిష్కారానికి గ్రామసభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గ్రామంలో కొత్తగా చేయాల్సిన పలు అభివృద్ధి పనులపై ప్రణాళికలు, ప్రజల సహకారంతో సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దు

- సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

అనకాపల్లి: స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో పలు ప్రాంతాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాంధీనగరం, నెహ్రూచౌక్, ఎన్టీఆర్ క్రీడా మైదానంలో కరపత్రాలను పంపిణీ చేశారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే విద్యుత్ శాఖ సిబ్బందిని తరిమికొట్టాలని వ్యాఖ్యలు చేసిన నారా లోకేష్ అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా వాటిని బిగించాలని ఆదేశాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో అదనంగా గతేడాది నవంబర్, డిసెంబర్ మాసాల నుంచి వినియోగదారుల నుంచి విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. అదానీ కంపెనీకి ఒప్పందం ప్రకారం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలను మోపొద్దని కోరారు. కూటమి ప్రభుత్వం ఇటువంటి విధానాలను విడనాడాలని, లేని పక్షంలో రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, కె.తెలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన ఇద్దరు అరెస్ట్

పెందుర్తి : ఓ దుకాణంలో ఇనుము దొంగలించడానికి ప్రయత్నించిన ఇద్దరిని పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యం మత్తులో ఈ చోరీకి పాల్పడినట్లు తెలియడంతో స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. వేపగుంట – పినగాడి రోడ్డు లక్ష్మీపురం సమీపంలో ఓ మెకానిక్ దుకాణం ఉంది. దీనికి సమీపంలో లక్ష్మీపురానికి చెందిన గొంప ప్రియదర్శన్, కంచరపాలేనికి చెందిన కామిరెడ్డి ప్రసాద్ శుక్రవారం అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. తర్వాత ఆ దుకాణంలోకి చొరబడ్డారు. గమనించిన స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దీంతో స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకుని వారిద్దరినీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ చేయగా వారిద్దరూ మద్యం మత్తులో చోరీకి యత్నించినట్లు తేలింది. దీంతోపాటు వీరిపై గతంలో కూడా ఎలాంటి నేరాభియోగాలు లేకపోవడంతో పూర్తిస్థాయి వివరాలు సేకరించి స్టేషన్ బెయిల్‌పై పంపినట్లు ఎస్ఐ సూరిబాబు తెలిపారు.

స్టీల్ ప్లాంట్‌పై ప్రధాని స్పష్టమైన హామీ ఇవ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం

అనకాపల్లి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రదాని మోడీతో స్పష్టమైన ప్రకటన విశాఖ వేదికగా ఈనెల 8న కూటమి నేతలు చెప్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడుల ప్రత్యేక శ్రద్ధ కారణంగా జిల్లాలో రూ.2 లక్షల కోట్లతో పరిశ్రమలు రానున్నాయని రెండు రోజుల క్రితం ఎంపీ సీఎం రమేష్ చెప్పారన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమిని గెలిపించినట్లయితే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. వీటికి కట్టుబడకుండా నక్కపల్లిలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడమంటే ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా నేటికీ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుప గనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనం, రూ.18 వేల కోట్ల ప్యాకేజీ వంటి సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై దాసోహమై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సదుపాయాలు కల్పించడానికి సిద్ధంగా ఉందన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎటువంటి పన్నులు, విద్యుత్ రాయితీలు కల్పించకుండా ఎన్నికల వాగ్దానాన్ని విస్మరించి ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేసిందన్నారు. ఇప్పటికే పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో సేకరించిన భూములకు పరిహారం, ప్యాకేజీ పూర్తిస్థాయిలో ఇవ్వకుండా భారీగా పోలీసులను మోహరించి బల్క్‌డ్రగ్ కోసం పనులు చేయడం అన్యాయమన్నారు. కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్‌డ్రగ్స్ పార్కును ప్రభుత్వం నక్కపల్లిలో ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నక్కపల్లిలో ఇప్పటికే హెటిరో డ్రగ్స్ కంపెనీతో అక్కడ ప్రజలంతా వాయు, జల కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని, వేలాది మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నప్పటికి కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేకుండా పోయిందన్నారు.

గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధం

- నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తమ్మపాల: మండలంలోని కొండపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమైంది. గ్రామస్తుల సమాచారం మేరకు.. ఫైరింజన్ వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. గ్రామంలో కోట్ని సన్యాసిరావుకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమై రూ.10 లక్షల విలువ చేసే గృహోపకరణాలు, వగైరా సామగ్రి కాలి బూడిదయ్యాయి. కుమార్తె వివాహం కోసం అప్పుగా తీసుకున్న రూ.3 లక్షలు, బీరువాలో మరి కొన్ని ఆభరణాలు కాలిపోయినట్లు వారు తెలిపారు. నిరాశ్రయులైన వారికి ఎంపీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు బోండా అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గనిరెడ్డి శ్రీరాములు రూ.10 వేలు విలువ చేసే నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గనిరెడ్డి బుజ్జి, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్, ఉద్యోగులు

తుమ్మపాల: ఏపీ తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం నూతన సంవత్సరం – 2025 క్యాలెండర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ శనివారం ఆవిష్కరించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలపై నివేదించారు. ఏపీ టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసచార్యులు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం. వెంకటలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, సంఘ జిల్లా అధ్యక్షుడు రామారావు, జిల్లా కార్యదర్శి కె.ఎస్.ఆర్.కె జి.నరసింహారావు, జోనల్ ఉపాధ్యక్షుడు వి.ఎ.సుబ్బారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వి.ఎస్.ఎం.లక్ష్మి, జిల్లా ట్రెజరర్ ఎస్.అమ్మాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు జాగరపు వెంకటరావు, పి.మోసెస్, ఎస్.వి.రమణ, పి.రవికుమార్, జమ్ము శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలు వ్యాధులు బారిన పడకుండా అవగాహన



పీహెచ్‌సీ వైద్యురాలు వాణిజగదీశ్వరితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పడాల రవికుమార్

అనకాపల్లి: శీతాకాలంలో ప్రజలు వ్యాధులు బారిన పడకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో పడాల రవికుమార్ తెలిపారు. మండలంలో తుమ్మపాల పీహెచ్‌సీలో వివిధ విభాగాలను శనివారం ఆయన పరిశీలించారు. వివిధ రకాల వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించి, వారి మన్ననలను పొందాలన్నారు. ఎన్‌సీడీ సర్వేను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని, పెద్ద పెద్ద వ్యాధులతో బాధపడే రోగులను దగ్గరలో ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యురాలు వాణి జగదీశ్వరి, సీహెచ్‌వో డి.శారద, హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ, సూపర్‌వైజర్ బి.సంగం తదితరులు పాల్గొన్నారు.

రామావతారంలో వేంకటేశ్వరస్వామి



రామావతారంలో భక్తులకు దర్శనం

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి చక్రవర్తి మాట్లాడుతూ ఆది, సోమవారాలు రామావతారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

కార్మికుల సమస్యలపై నేడు సభ

పరవాడ : రవాణా రంగ కార్మికుల సమస్యలపై ఈ నెల 5న అనకాపల్లిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి కార్మికులంతా తరలిరావాలని, అధిక సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని వాడచీపురుపల్లిలో శనివారం విడుదల చేశారు. ఈ సభలో అఖిలభారత రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని గనిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సొసైటీ మహాజన సభ నేడు

సింహాచలం : అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌కి వెళ్లే మార్గంలో ఉన్న బృందావనం మండపంలో ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. సొసైటీ లావాదేవీలు, డివిడెండ్ల పంపిణీ, తదితర విషయాలపై సభ్యులతో చర్చిస్తామని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులంతా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి



కశింకోట బాలికల పాఠశాలలో దివ్యాంగులకు బహుమతుల అందజేత



చింతలపాలెంలో దివ్యాంగులకు వీల్‌చైర్ అందజేత

కశింకోట: స్థానిక బాలికల పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ లిపి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తన బ్రెయిలీ లిపి రూపొందించడం ద్వారా విద్యనభ్యసించేలా అంధుల జీవితాల్లో వెలుగును నింపారని వక్తలు ప్రస్తుతించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. బాలికల పాఠశాల హెచ్‌ఎం సీహెచ్. రామునాయుడు, ఉపాధ్యాయుడు శంకరరావు, ఐఆర్టీ ఉపాధ్యాయురాలు రమణమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. చింతలపాలెంలో భాగవతుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగురాలికి వీల్‌చైర్, కృత్రిమ కాలును పంపిణీ చేశారు. దివ్యాంగుల సంఘ ప్రతినిధి షేక్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకాంద స్ఫూర్తితో యువత ఎదగాలి



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సబ్బవరం: యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ ఎస్. శ్రీధర్ అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ హక్కులతో పాటు బాధ్యతలను నెరవేర్చినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో విశాఖవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో ఉత్సవాలను 12వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి ఉత్సవాలను దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి. సూర్యప్రకాశరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పినట్లు యువత స్థిర నిర్ణయం, విశ్వాసంతో ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సెక్రటరీ స్వామి శ్వాసం వియానానంద మాట్లాడుతూ స్వామి వివేకానంద సందేశం చాలా సరళమైందని, సామాజికంగా సమతుల్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని స్వామి వివేకానంద అభిప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామి గీత స్వరానంద, అడ్వకేట్ రాంబాబు, ఎం. సత్యనారాయణరాజు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సహాయం



సంక్షేమ నిధి చెక్ అందిస్తున్న పింఛన్‌దారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పెందుర్తి : రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంక్షేమ సంఘం పెందుర్తి యూనిట్ ఇటీవల మృతి చెందిన ఆ సంఘం సభ్యుడు పీసీహెచ్ నారాయణమూర్తి కుటుంబానికి అండగా నిలిచింది. శనివారం పెందుర్తి యూనిట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నారాయణమూర్తి భార్య నారాయణమ్మకు జిల్లా సంక్షేమ నిధి నుంచి రూ.70 వేలు చెక్ అందించారు. కార్యక్రమంలో సంఘం పెందుర్తి యూనిట్ అధ్యక్షుడు అల్లం కృష్ణారావు, కార్యదర్శి వై.కామరాజు, అసోసియేటెడ్ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు భాస్కరరావు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికుల సదస్సు జయప్రదం చేయాలి



ఆటో డ్రైవర్లకు కరపత్రాలు అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు శివాజీ

యలమంచిలి రూరల్: రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, ఇతర కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ కోరారు. అనకాపల్లిలో జరగనున్న ఈ సదస్సుకు అఖిల భారత ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులంతా హాజరు కావాలని కోరారు. శనివారం పట్టణంలో పలువురు ఆటో, వ్యాన్ల డ్రైవర్లు, కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ సంఘం యలమంచిలి మండల కన్వీనర్ ఎం. శ్రీనివాస్, గంగాధర్, లోవరాజు, అనిల్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఘనంగా తిరువీధోత్సవం

ఎస్.రాయవరం: ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని కొరుప్రోలు సీతారామస్వామి ఉత్సవ మూర్తులను తిరువీధోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయం నుంచి గ్రామ ప్రధాన వీధుల్లో స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సుందరి, ట్రస్టు సభ్యులు

దేవరాపల్లి : కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు స్టడీ మెటీరియల్ వితరణ చేశారు. కాశీపురం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు బీబీటీ సుందరి సమక్షంలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న 14 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి టెన్త్‌లో శత శాతం మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రస్ట్ సభ్యులు దివాకర్, కర్రి దారప్రసాద్, పూజ, యడ్ల స్వాతి పాల్గొన్నారు.